క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎంపీపీ కృపేష్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకాగలరని ఆయన కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 322 ఆవులు, 25 గేదెలకు పశు వైద్యాధికారి డా.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలను ఇచ్చారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

యాచారం: వీఆర్‌ఏల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని యాచారం మండల వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు సోమవారం ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పదోన్నతులు కల్పించాలని, వేతనాలు పెంచాలని, వీఆర్‌ఏలు మృతి చెందితే అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కోదండరెడ్డి హామీ ఇచ్చారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: మండలంలోని మంగళపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా శరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా అశ్విత, 25 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు బన్సీలాల్, హన్మంత్, శ్రీనునాయక్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి..

బయలుదేరిన శివస్వాములు



తలకొండపల్లి: శివస్వాములు సోమవారం మండల కేంద్రం నుంచి శ్రీశైలం దేవస్థానానికి పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం, యజ్ఞాలు నిర్వహించారు. 41 రోజులు భక్తిశ్రద్ధలతో శివ దీక్షలు చేసిన శివస్వాములు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకుని శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో శివస్వామి యాదగిరి, భక్తులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గతంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని శివారు కాలనీల్లో 18 కి.మీ.ల పైపులైన్ నిర్మాణం చేపట్టాలని జలమండలి ఎండీకి కలిసి ఎమ్మెల్యే వివరించారు. దీంతో పైపులైన్ మంజూరు కావడంతో ప్రారంభోత్సవానికి చర్యలపై సోమవారం ఎమ్మెల్యే జలమండలి అధికారులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తామని, ప్రతి శివారు కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు రాజ్‌గోపాల్, రాజు, వాహిణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వివిధ కాలనీలకు వాటర్ పైప్‌లైన్ పనులు మంజూరయ్యాయి. కమలానగర్ విభాగంలో అల్లూరి కాలనీ, దుర్గానగర్, విజయ్‌నగర్ కాలనీ, నాగోలు విభాగంలో ఫతుల్లగూడ విలేజ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీ, శ్రీ గణేశ్‌నగర్‌లో పైపులైన్ పనులు జరగనున్నాయి.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి త్రిపురాంతకేశ్వరస్వామి ఉత్సవాలు
- 7, 8న రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



ఆమనగల్లు: అయ్యసాగరంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం

ఆమనగల్లు: మండలంలోని రాంనుంతల సమీపంలోని అయ్యసాగరం అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివకోటి జపయజ్ఞ 28వ వార్షికోత్సవ వేడుకలను కూడా నిర్వహిస్తున్నారు. రాంనుంతల గ్రామ సమీపంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయాల్లో ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు. భక్తుల కోసం తాగునీరు, చలువపందిళ్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పూర్తిచేశామని నిర్వాహకులు కరుణాకర్‌రెడ్డి, బట్టు నర్సిరెడ్డి, పంచాక్షరి, శ్రీనునాయక్, సరితపంతునాయక్ తదితరులు తెలిపారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

మాడ్గుల: మాడ్గుల మండలం కొలుకులపల్లిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలను ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం తాగునీరు తదితర సదుపాయాలు కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీటీసీ బట్టు కిషన్ రెడ్డి కోరారు.

‘లయన్స్’ సేవలు ప్రశంసనీయం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జీఎల్‌ఎన్



అంబలి అందజేస్తున్న సిబ్బంది

కడ్తాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి (జీఎల్‌ఎన్) అన్నారు. వేసవిలో ప్రయాణికులు, పేదల కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. 100 రోజుల పాటు నిరంతరాయంగా ప్రయాణికులు, ప్రజానీకానికి రాగి అంబలిని ఉచితంగా అందించడం అభినందనీయమని అన్నారు. లయన్స్ క్లబ్‌కు తమవంతు సహాయ, సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మాజీ వార్డు సభ్యులు రాంచంద్రయ్య, లయన్ ఎల్ఎన్.లక్ష్మయ్య, రాజేందర్‌యాదవ్, పాండు, శంకర్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు రామకృష్ణ తండ్రి రామస్వామి ఇటీవల మృతిచెందాడు. సోమవారం ఆమనగల్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, రామకృష్ణను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాములు, కోనాపూర్ ఎంపీటీసీ పంతునాయక్, నాయకులు మల్లేశ్, రమేశ్, గణేశ్ ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మీర్‌పేట: మహారాష్ట్ర భీవండీ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన బీవైఎంఏ కప్–2024 6వ ఆలిండియా కుంగ్‌ఫూ కరాటే జూడో ఛాంపియన్‌షిప్‌లో మీర్‌పేటలోని న్యూ డ్రాగన్ ఫైటర్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో అకాడమీకి చెందిన బి.మానిక్, సుశాంత్, భుమిజ, వివేక్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా, వర్ధన్ సిల్వర్ మెడల్ సాధించినట్లు శిక్షకులు దాసరి జితేందర్, పీ.వీ.శ్రీరాములు తెలిపారు. రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చడం అభినందనీయమని, భవిష్యత్‌లో అన్ని టోర్నమెంట్‌లో సత్తా చాటేలా శిక్షణ ఇస్తామని వారు చెప్పారు.

సోమాసాత్ ఆలయంలో ప్రత్యేక పూజలు

కందుకూరు: మండల పరిధిలోని దావూద్‌గూడతండాలో గిరిజన ఆరాధ్య దేవుడు సోమాసాత్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమ వారం గిరిజనులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాత్లావత్ రుక్మన్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు హోమాన్ని నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, మాజీ సర్పంచ్ అంజయ్యగౌడ్, నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ స్పష్టం చేశారు. సోమవారం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ ఫేజ్–1 కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, కాలనీ ప్రతినిధులు రాజు, మహేశ్, గోపాలరావు, రఘుపతిరెడ్డి, సృజన, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి

తుర్కయంజాల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి కమ్మగూడలోని కేబీ స్కూల్ 27వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి సమాజంలో సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లలు తప్పుదోవ పట్టే ప్రమాదం ఉందని..తల్లిదండ్రులు వారిపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, లైఫ్ కోచ్ డా.శ్రీనాద్‌రెడ్డి, కేబీ స్కూల్ కరెస్పాండెంట్ రెడ్డి తదితరులు పల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఘనంగా పోలీస్ సందల్



దర్గాపైకి గంధం తీసుకెళ్తున్న సీఐ గురువారెడ్డి, డీఐ సుధీర్‌కృష్ణ

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్‌లోని షర్ఫూద్దీన్ బాబా దర్గా 758వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ తరఫున సందల్(గంధం) ఊరేగించారు. ఆనవాయితీలో భాగంగా ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కృష్ణలు తలపై పూలు, ఛాదర్ పెట్టుకొని ఊరేగింపుగా దర్గాపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లీలు ఫరీదుద్దీన్, ఇర్ఫాన్‌లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఊరేగింపులో పోలీస్ సిబ్బంది ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. కార్యక్రమంలో ఎస్సైలు మధుసూదన్, భాస్కర్, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో గల శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రం ఎంపీపీ కార్యాలయంలో మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఆలయ చైర్మన్, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 7 (గురువారం) నుంచి మార్చి 11వ తేదీ(సోమవారం) వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులను అధిక సంఖ్యలో తరలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గతంతో పోలిస్తే ఈసారి భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు భారీగా చేయాలని అధికారులను సూచించారు. ఆలయం చుట్టూ పారిశుద్య పనులను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేస్తూ బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేయాలని అధికారులను కోరారు. పారిశుధ్యం, నీటి సరఫరా, పోలీస్, వైద్య శాఖ, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా తమ సేవలను అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. భక్తులకు మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతానాయక్, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పద్మశ్రీ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ ప్రియాంక, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారి మురళీకృష్ణ, విద్యుత్ ఏఈ చక్రపాణి, మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి, వైద్యాధికారి మల్లికార్జున్, అగ్నిమాపక అధికారి రాజు, ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, ఆలయ కమిటీ పెద్దలు అంధ్యా నాయక్, ఈశ్వర్, యాదయ్య, రాఘవేందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

సీపీఎం నేత యాదయ్య

మంచాల: రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నేత పగుడాల యాదయ్య కోరారు. ఈ మేరకు మంచాల తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. యాదయ్య మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల్లో నెలకొన్న తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. భూములను సాగుచేస్తున్న రైతుల పేర్లు రికార్డులో నమోదు చేయాలని కోరారు. ఆరుట్ల గ్రామంలో 684, 1466, 1363, 1671 సర్వే నంబర్లలోని అసైండ్ భూములు గల రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాలవారీగా రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి , శ్యాంసుందర్, రాజు, గోపాల్, శేఖర్, శ్రీను,బుగ్గరాములు, రంగయ్య, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆపార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మంచాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 17 స్థానాలు కాంగ్రెస్ పార్టీయే గెలిచేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహదేవ్ ఆలయ చైర్మన్‌గా శశిధర్‌రెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన మహదేవ్ శివాలయ నూతన చైర్మన్‌గా బాలాపూర్ గ్రామానికి చెందిన టేకుల శశిధర్‌రెడ్డిని సోమవారం స్థానికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ సభ్యులుగా కళ్లెం శ్రీధర్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్కె మాధవి, పగడాల ఉమేశ్, ఆలయ అర్చకులుగా జయదుర్గప్రసాద్‌లను ఎన్నుకొని వారితో ఎండోమెంట్ అధికారులు ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, హైందవ లక్షమే తమ లక్ష్యమని శశిధర్‌రెడ్డి తెలిపారు. నియామకానికి పూర్తి సహకారం అందించిన బాలాపూర్ గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి, బండారి మనోహర్, బాలునాయక్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత, ఈవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బాల్‌నింగని జంగయ్య, కళ్లెం విష్ణువర్ధన్‌రెడ్డి, మేకల సంజీవ, రాజేందర్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, నీరుడు శ్రీరాములు, ఎం.శ్రీధర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎండోమెంట్ అధికారులు

తండాల్లో వసతులు కల్పిస్తాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్

ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్

మహేశ్వరం: గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పని చేస్తానని మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునితానాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కేసీ తండాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.10లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె స్థానిక తండావాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఉన్న గిరిజన తండాల్లో బీటీ, సీసీరోడ్డు నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ప్రతి గ్రామం, గిరిజన తండాల్లో తాగునీటి, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, సీసీరోడ్ల నిర్మాణంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేయించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. మండల నిధులను ఉపయోగించి గ్రామాలు, అనుబంధ గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోతిలాల్‌నాయక్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అంధ్యానాయక్, మాజీ ఎంపీటీసీ భద్రునాయక్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, తండావాసులు రవీందర్‌నాయక్, సూర్యనాయక్, లాలూనాయక్, రెడ్యానాయక్, రవినాయక్, మున్యానాయక్, రాము, లక్ష్మణ్, శశికాంత్, రవి, రాజు, రమేశ్, నరేశ్, వినోద్, మహేశ్, చంద్రకాంత్, శివ పలువురు పాల్గొన్నారు.

నేడే అవిశ్వాసం

- రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో సమావేశం
- ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి
- హాజరుకాబోమని ప్రకటించిన మెజార్టీ కౌన్సిలర్లు



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస నోటీసుపై మంగళవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ప్రిసైడింగ్ అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. ఇదిలా ఉండగా మూడురోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అవిశ్వాస సమావేశానికి హాజరుకాకూడదని నిర్ణయించినట్లు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించే అవిశ్వాసం సభ మెజార్టీ సభ్యులు లేకపోవడంతో వీగిపోయే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

మొత్తం 24 మంది కౌన్సిలర్లు

2020 జనవరి నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 17 మంది కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పార్టీ 5 మంది, బీజేపీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్‌గా ఒకరు గెలిచారు. తదనంతర కాలంలో కొందరు పార్టీ మారడంతో ప్రస్తుతం కాంగ్రెస్‌లో 13, బీఆర్‌ఎస్‌లో 10, బీజేపీలో ఒకరు కౌన్సిలర్ ఉన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 1న మొత్తం 20 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి వైస్ చైర్‌పర్సన్ హరితపై అవిశ్వాసానికి లేఖ అందజేశారు. ఈ క్రమంలో కలెక్టరేట్ ఆదేశాలనుసారం మార్చి 5న ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించనున్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

పార్టీలోని కౌన్సిలర్ల మధ్య నెలకొన్న ఈ వివాదానికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి కౌన్సిలర్లతో ఇటీవల సమావేశం నిర్వహించారు. వివాదాలకు చోటు లేకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని వారు సూచించినట్లు చైర్ పర్సన్ అనురాధ తెలిపారు. మెజార్టీ ఉన్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై వెనుకడుగు వేయడంతో ఎలా ముందుకు వెళ్లాలా అని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆలోచనలో పడ్డారు.

టూర్‌లో కౌన్సిలర్లు...

అవిశ్వాస సభకు హాజరుకాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో వైస్ చైర్‌పర్సన్, 11 మంది కౌన్సిలర్లు టూర్‌కు వెళ్లినట్లు సమాచారం. మంగళవారం జరిగే సమావేశానికి 16 మంది సభ్యులు హాజరుకాకపోతే అవిశ్వాసం వీగిపోతుంది కాబట్టి సమావేశం అనంతరం టూర్ నుంచి తిరిగి రానున్నారు.